
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
ఆదివారం 29 డిసెంబరు 2024

అభివృద్ధికి ప్రాధాన్యం

- పెద్దపల్లికి బస్ డిపో మంజూరు
- మానేరుపై వంతెనల నిర్మాణానికి నిధులు
- ఏడాదిలో రూ.2,500 కోట్ల పనులకు శ్రీకారం
- ప్రతిపాదనల్లో రామగుండం 800 మెగావాట్ల విద్యుత్ ప్లాంటు
- పత్తిపాక రిజర్వాయర్ నిర్మాణానికి అడుగులు


పత్తిపాక రిజర్వాయర్ ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు (ఫైల్)

(ఆంధ్రజ్యోతి. పెద్దపల్లి)

రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం జిల్లా అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నది. జిల్లాలోని దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పెద్దపల్లి, రామగుండం ఎమ్మెల్యేలు చింతకుంట విజయరమణారావు, రాజ్‌ఠాకూర్ మక్కాన్ సింగ్ పాటుపడుతున్నారు. గడిచిన ఏడాది కాలంలో విద్య, వైద్యం, విద్యుత్, రహదారుల అభివృద్ధితో పాటు టూరిజానికి ప్రాధాన్యం ఇచ్చారు. పెద్దపల్లికి బస్ డిపోను మంజూరుచేయగా, మానేరుపై రెండు వంతెనల నిర్మాణాలు, రోడ్ల అభివృద్ధి, ఆసుపత్రుల అప్‌గ్రేడేషన్‌తో పాటు సుమారు 2,500 కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు నిధులు మంజూర య్యాయి. అర్ధంతరంగా నిలిచిపోయిన చిన్న కాళే శ్వరం ప్రాజెక్టుకు 513 కోట్ల రూపాయలు మంజూర య్యాయి. అలాగే రామగుండంలో బీ-థర్మల్ ప్రాజెక్టులో 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి, రైతుల చిరకాల వాంఛ అయిన పత్తిపాక రిజర్వాయర్ నిర్మా ణానికి అడుగులు పడ్డాయి. వివిధ అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహా మంత్రి వర్గం రాగా, రామగుండం, ధర్మారం, పెద్దపల్లిలో జరిగిన కార్యక్రమాలకు ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఆయా శాఖల మంత్రులు హాజరయ్యారు. ఈనెల 4వ తేదీన పెద్దపల్లిలో నిర్వహించిన యువ వికాసం బహిరంగ సభకు హాజరైన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి జిల్లాలో చేపట్టనున్న 1,024 కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడం గమనార్హం.



● రహదారులు, వంతెనలకు నిధులు..

జిల్లాలో మానేరు నదిపై రెండు వంతెనలు, రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తూ నిధులు మంజూరుచేసింది. ఓదెల మండలం రూప్‌నారాయణపేట్ వద్ద మానేరుపై వంతెన నిర్మాణానికి రూ.80 కోట్లు, మానేరుపై మంథని మండలం శివ్వారం వద్ద మానేరుపై మరో వంతెన నిర్మాణానికి 125 కోట్ల రూపాయలు మంజూరు చేశారు. రూ.162 కోట్లతో మంథని పట్టణం చుట్టూ రింగ్ రోడ్డు నిర్మాణాన్ని చేపట్టనున్నారు. ఈ పనులకు ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. మంథని పట్టణంలో పలు అభివృద్ధి పనులకు రూ.30 కోట్లు మంజూరు చేయించారు. ఎల్ మడుగుకు వెళ్లే రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. ఎక్లాస్‌పూర్-ఖమ్మంపల్లి రోడ్డు వెడల్పుకు రూ.11.90 కోట్లు, ఖానాపూర్ నుంచి ఎల్.మడుగు

మిగతా 8వ పేజీలో...

6లోపు మైనారిటీలు దరఖాస్తు చేసుకోవాలి

పెద్దపల్లి కల్చరల్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి) : నాలుగు నెలల వివిధ బేసిక్ ఫౌండేషన్ కోర్సుల్లో శిక్షణకు జనవరి 6లోపు మైనారిటీలు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి జె.రంగారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర మైనారిటీస్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లాలో నిర్వహించే వివిధ కోర్సుల్లో బేసిక్ ఫౌండేషన్ కోర్సు శిక్షణకు అర్హులైన మైనార్టీలు (ముస్లిం, క్రిస్టియన్, సిక్కు, బౌద్ధులు, జైనులు, పార్సికులు) నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. గ్రూప్స్, రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు, స్టాఫ్ సెలక్షన్ కమిటీ, బ్యాంకింగ్ మొదలైన వివిధ పోటీ పరీక్షలకు సంబంధించి పలు రకాల 4 నెలల బేసిక్ ఫౌండేషన్ కోర్సులను ఉచితంగా అంది స్తున్నామని పేర్కొన్నారు. అభ్యర్థులు కలెక్టరేట్ లోని జిల్లా మైనారిటీస్ సంక్షేమ శాఖ కార్యాల యంలో జనవరి 6వ తేదీలోపు దరఖాస్తులు సమర్పించాలని, విద్యార్హత సర్టిఫికెట్లు జతపరచాలని పేర్కొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

సుల్తానాబాద్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : సుల్తానాబాద్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు అధ్యక్షులు మాటేటి సంజీవ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జనవ రి 2న సుల్తానాబాద్ శ్రీవాణి డిగ్రీ కళాశాల లో ఉదయం పదిన్నర నుంచి మధ్యాహ్నం రెండున్నర గంటల వరకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహిస్తారన్నారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని తెలిపారు. ఆపరేషన్ అవసరమైన వారు వెంట ఆధార్ కార్డులను, తెల్లరేషన్ కార్డులను తీసుకురావాలని కోరారు. పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సంజీవ్ సూచించారు.

రామగుండం ఎన్టీపీసీ కొత్త హెచ్‌వోపీగా చందన్ కుమార్

జ్యోతినగర్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : రామగుండం ఎన్టీపీసీ, టీఎస్‌టీపీపీ హెడ్ ఆఫ్ ది ప్రాజెక్టు(హెచ్‌వోపీ)గా చందన్ కుమార్ సామంతను నియమించారు. బీహార్‌లోని నాబినగర్ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు(ఎన్ఎస్‌టీపీపీ) హెచ్‌వోపీగా పనిచేస్తున్న చందన్ కుమార్‌ను రామగుండం ప్రాజెక్టుకు బదిలీ చేస్తూ కార్పొరేట్ నుంచి ఉత్తర్వులు వచ్చాయి. ప్రస్తుతం రామగుండం ఈడీ(ఇన్‌చార్జి ఆర్ఈడీ సౌత్)గా పనిచేస్తున్న కేదార్ రంజన్‌పాండు ఈనెల 31న పదవీ విరమణ చేయనున్నారు. కేదార్‌రంజన్ స్థానంలో చందన్ కుమార్ సామంతను హెచ్‌వోపీగా నియమించారు.

విప్లవ శక్తులు ఏకం కావాలి..

- న్యూడెమోక్రసీ జాతీయ ప్రతినిధి దర్శన్‌సింగ్ కట్కర్


మాట్లాడుతున్న వేములపల్లి వెంకట్రామయ్య

7

హామీలను విస్మరిస్తే ఉద్యమం..

- సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాజారెడ్డి


నినాదాలు చేస్తున్న సీఐటీయూ శ్రేణులు

8

10లోపు కార్యాలయాలు తరలించండి

- బస్ డిపోకు భూమి అప్పగింతపై కలెక్టర్ సమీక్ష

పెద్దపల్లి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పెద్దపల్లి ఎంపీడీవో ప్రాంగణంలోని కార్యాలయాల తరలింపు ప్రక్రియను జనవరి 10లోపు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. సంబంధిత అధికారులతో శనివారం రివ్యూ మీటింగ్ నిర్వహించారు. జిల్లాలో బస్సు డిపో మంజూరైన నేపథ్యంలో టీజీఆర్‌టీసీకి స్థలం అప్పగించేందుకు వీలుగా ఎంపీడీవో ప్రాంగణంలో ఉన్న మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయం, మండల విద్యాశాఖ కార్యాలయం, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ కార్యాలయం, అబ్కారీ శాఖ కార్యాలయం తరలింపునకు ప్రభుత్వ భవనాల్లో అనువైన చోటును ఎంపిక చేసుకోవాలని సూచించారు. పెద్దపల్లిలో ప్రభుత్వ భవనాలు వీలులేని పక్షంలో ప్రైవేటు భవనాలను ఎంచుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఈఈపీఆర్ గిరీష్‌బాబు, డీఈవో మాధవితోపాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడి తీరుపై నిరసన

పెద్దపల్లిటౌన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ జిల్లా అధ్యక్షుడు చందుపట్ల సునీల్‌రెడ్డిపై మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి వర్గీయులు నిరసన వ్యక్తం చేశారు. స్థానిక నందన గార్డెన్లో శనివారం సభ్యత్వ నమోదుపై నిర్వహించిన సమావేశానికి రాష్ట్ర ప్రధానకార్యదర్శి అబ్జర్వర్ కాసం వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా సభ్యత్వం, సాధారణ సభ్యత్వం, క్రియాశీల సభ్యత్వం, బూత్ కమిటీలపై చర్చ జరిపారు. అయితే గుజ్జుల వర్గీయులు సభను వ్యతిరేకిస్తూ నెలపై బైఠాయించి నిరసన తెలిపారు. దీంతో నిరసన తెలుపుతున్న నాయకుల వద్దకు వెళ్లిన కాసం వెంకటేశ్వర్లుకు జిలాల్లో జరుగుతున్న వ్యవహారాన్ని వివరించారు. తాము కూడా పెద్దఎత్తున సభ్యత్వ నమోదు చేయించామని, సమావేశం జరుగుతున్న సమాచారం జిల్లా అధ్యక్షుడు తమకు ఇవ్వలేదని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. పార్టీ మండల కమిటీల ఎన్నికల విషయం తెలుపట్లేదని, కేవలం రాష్ట్ర కార్యదర్శి, దుగ్యాల ప్రదీప్‌రావు ఆదేశాల మేరకే సునీల్‌రెడ్డి వ్యవహరిస్తున్నాడని తెలిపారు. జిల్లాలో జరుగుతున్న కార్యక్రమాలు, రాష్ట్ర కమిటీ తీసుకున్న నిర్ణయాలు తెలుపకపోగా తమకు అందుబాటులో ఉండడంలేదని, స్థానికంగా ఉన్న క్యాడర్‌ను పక్కన బెట్టి కొత్తగా వచ్చిన వాళ్లకే పదవులు ఇస్తున్నారని ఫిర్యాదు చేశారు. ఎన్నో ఏళ్ళుగా పార్టీ జెండా మోస్తున్నామని, ఏలాంటి పదవులు కూడా ఆశించడం లేదని సీనియర్ నాయకులను పక్కన బెట్టి కొత్తగా వచ్చిన వారితోనే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు.

దీంతో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఇప్పటి నుంచి అలా జరిగితే తనకు ఫోన్‌కాల్ చేస్తే రాష్ట్ర కమిటీ దృష్టికి తీసుకవెళ్లి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

ట్రెంచ్ కటింగ్ పనులు సకాలంలో పూర్తి

- కలెక్టర్ కోయ శ్రీహర్ష


పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ కోయశ్రీహర్ష

మంథని, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : వరంగల్-మంచిర్యాల జాతీయ రహదారి ఎన్‌హెచ్ 163జీ నిర్మాణానికి సేకరించిన భూములలో ట్రెంచ్ కటింగ్ పనులు పూర్తి చేసి జాతీయ రహదారి ఆథారిటీకి అప్పగిం చాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. శని వారం మంథని మండలంలోని కన్నాల, పందులపల్లి గ్రామాల్లో ట్రెంచ్ కటింగ్ పను లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. మంచిర్యాల-వ రంగల్-ఖమ్మం జిల్లాలను కలిపే 4 లైన్ల గ్రీన్ ఫీల్డ్ హైవే సేకరించిన భూమిని జాతీయ రహదారుల అథారిటీకి అప్పగించామని, మంథని మండలం కన్నాల, పందులపల్లి గ్రామాల్లో ట్రెంచ్ కటింగ్ పనులను ప్రారం భించిందన్నారు. భూములల్లో ట్రెంచ్ పనుల ను సకాలంలో పూర్తిచేసి, జాతీయ రహదారి నిర్మాణపనులు సజావుగా జరిగేందుకు జిల్లా యంత్రాంగం తరుపున పూర్తి సహకారం అందిస్తామన్నారు. జాతీయ రహదారి కింద సేకరించిన భూముల్లో యాసంగి పంటలు సాగు చేయరాదని రైతులకు సూచించారు. కలెక్టర్ వెంట మంథని తహసీల్దార్ రాజయ్య, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్మీడియట్‌లో అత్యుత్తమ ఫలితాలు..

- అదనపు కలెక్టర్ వేణు


సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వేణు

పెద్దపల్లి కల్చరల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా ఇంటర్మీడియట్‌లో అత్యుత్తమ ఫలితాలు సాధించేలా ప్రయత్నించాలని అదనపు కలెక్టర్ వేణు పేర్కొన్నారు. కలెక్టరేటర్ సమావేశమందిరంలో జిల్లాలోని జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి డి కల్పన ఆధ్వర్యంలో ఈ సమావేశం ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా కృషి చేయాలని ప్రిన్సిపాల్‌లను ఆదేశించారు. అలాగే విద్యార్థులకు డ్రగ్స్ నివారణ కోసం ఇవ్ టీచింగ్ నివారణ కోసం పోలీస్ అధికారులు కొన్ని సూచనలు చేశారు. ఇంటర్మీడియట్ డైరెక్టర్ నిర్దేశించిన 90 రోజుల ప్రణాళికను పాటిస్తూ కళాశాలల్లో మంచి ఫలితాలను సాధించాలని సూచించారు. ఈ సమావేశంలో డీఎంహెచ్‌వో, డీసీపీ రాజు, ఏసీపీ రమేష్, అధికారులు పాల్గొన్నారు.

బేగంపేట్ బీపీఎమ్‌పై చీటింగ్ కేసు

రామగిరి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బేగంపేట్ పోస్టల్ బ్రాంచ్ మేనేజర్ హేమపై చీటింగ్ కేసు నమోదైనట్లు ఎస్ఐ చంద్రకుమార్ ఒక ప్రకటనలో వెల్లడించారు. పోస్టల్ ఖాతాదారుల డబ్బులు ఖాతాల్లో జమ చేయకుండా స్వంత అవసరాలకు వాడుకోవడంతో పాటు ఫిక్స్‌డ్ డిపాజిట్‌లకు సంబంధించిన అకౌంట్ హోల్డర్స్ వద్ద డబ్బులు తీసుకుని నకిలీ పుస్తకాలను జారీచేసిన వ్యవహారంపై కొంతకాలంగా విచారణ కొనసాగుతోంది. 46 మంది వద్ద సుమారు రూ.35లక్షలు దుర్వినియోగం చేసినట్లు గుర్తించారు. ఈ విషయంపై ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోస్టఆఫీస్ గోదావరిఖని డివిజన్ శ్రీనాథ్‌రెడ్డి, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శనివారం రాత్రి రత్నాపూర్‌కు చెందిన హేమను ఆమె ఇంటి వద్ద మంథని సీఐ రాజు ఆధ్వర్యంలో ఎస్ఐ చంద్రకుమార్ అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. న్యాయస్థానం 14రోజుల పాటు జ్యుడీషియల్ రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు ఘన నివాళి

కాల్వశ్రీరాంపూర్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతిపై మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంతాపం వ్యక్త చేశారు. మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం రెండు నిమిషాలు మౌనం పాటించారు. మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సదయ్య, నాయకులు సబ్బని రాజమల్లు, బంగారు రమేష్, మాదాసి సతీష్, శివరామకృష్ణ, జిన్నా రామచంద్రారెడ్డి, ఆషాడపు సురేష్, గోలి సుధాకర్, ఎండి.మునీర్, తదితరులు ఉన్నారు.

● యైటింక్లయిన్‌కాలనీ (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు ఐఎన్‌టీయూసీ, కాంగ్రెస్ నాయకులు నివాళులర్పించారు. ఆర్జీ-2 ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో స్థానిక యూనియన్ కార్యాలయంలో నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దశరథంగౌడ్, మార్కండేయ, అవినాష్, ఆకుల రాజయ్య, విజయ్, బర్ల రవీందర్, సత్తయ్య, జగదీష్, సురేష్, శ్రీనివాస్, అనంత రాములు, సందీప్, సైదులు పాల్గొన్నారు. పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అధ్యక్షుడు గుండేటి రాజేష్, నాయకులు మారెల్లి రాజిరెడ్డి, సాగంటి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాములకు ఎమ్మెల్యే అన్నదానం

సుల్తానాబాద్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : సుల్తానాబాద్ పట్టణంలోని శాస్త్రినగర్ అభయాంజనేయ స్వామి ఆలయంలో అయ్యప్ప స్వాములకు ఎమ్మెల్యే విజయరమణారావు అన్నదానం చేశారు. శనివారం శాస్త్రినగర్ నిత్యాన్నదాన శిబిరంలో ఎమ్మెల్యే విజయరమణారావు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అయ్యప్ప స్వాములకు అన్నదానం చేశారు. స్వాములకు ఆయన స్వయంగా ఆహార పదార్థాలను వడ్డించారు. ఎమ్మెల్యేను గురుస్వాములు, నిత్యాన్నదాన కేంద్రం నిర్వాహకులు సాయిరి మహేందర్-పద్మ దంపతులు, మిట్టపల్లి మురళి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వేగోళం అబ్బయ్యగౌడ్, మండల శాఖ అధ్యక్షుడు చిలుక సతీష్ తదితరులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు అంతటి అన్నయ్య గౌడ్, మార్కెట్ కమిటీ అధ్యక్షుడు మినుపాల ప్రకాష్‌రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మీరాజమల్లు తదితరులు పాల్గొన్నారు.


అయ్యప్ప స్వాములకు అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

కేంద్ర మంత్రి దృష్టికి స్వర్ణకారుల సమస్యలు

మార్కండేయకాలనీ, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): స్వర్ణకారుల సమస్యలు పరిష్కరించాలని జిల్లా సంఘం నాయకులు కేంద్రం హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కు విన్నవించారు. జిల్లా అధ్యక్షులు రంగు శ్రీనివాస్, ప్రధానకార్యదర్శి శ్రీరామోజు రాజు శనివారం కరీంనగర్‌లో కేంద్ర మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. నేరారోపణ మోపబడిన స్వర్ణకారులను నేరుగా కోర్టుకు పిలిపించేలా బీఎన్ఎస్ చట్టంలో మార్పులు తీసుకురావాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ ఎంఎస్ఎంఈ, ముద్ర రుణాలను స్వర్ణకారులకు పూచీకత్తులు లేకుండా అందజేయాలని, హిందూ వివాహ సంప్రదాయంలో అతి ముఖ్యమైన మాంగళ్యాన్ని కేవలం స్వర్ణకార వృత్తిదారులు మాత్రమే తయారు చేసి విక్రయించేలా మార్గదర్శకాలు జారీ చేయాలని కోరారు. ఈ సందర్భంగా సమస్యల పరిష్కారానికి తనువంతుగా కృషి చేస్తానని బండి సంజయ్ హామీ ఇచ్చినట్టు స్వర్ణకార సంఘం నాయకులు తెలిపారు.


కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

- టీఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు బొంకూరి శంకర్


కార్యక్రమంలో మాట్లాడుతున్న బొంకూరి శంకర్

జ్యోతినగర్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని టీఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు, ఎంప్లాయీస్ జేఏసీ చైర్మన్ బొంకూరి శంకర్ కోరారు. టీఎన్జీవోల రామగుండం యూనిట్ ఆధ్వర్యంలో శనివారం ఎన్టీపీసీ ఎఫ్ఐసీ క్రాస్‌లో జరిగిన తెలంగాణ ఎన్జీవోల సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరై బొంకూరి శంకర్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల నాలుగు డీఏలను వెంటనే విడుదల చేయాలని, పీఆర్‌సీని ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని, ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ రూపొందించాలని, కాంట్రిబ్యూటరీ పెన్షన్‌స్కీం రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని, 317 బాధితులకు న్యాయం చేయాలని తదితర ఉద్యోగులకు సంబంధించిన అన్ని అంశాలను త్వరగా పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. అనంతరం భారీ సంఖ్యలో ఉద్యోగులు సభ్యత్వ నమోదు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి సందీప్‌రావు, ఉపాధ్యక్షులు కొమురయ్య, పట్టణ కార్యదర్శి ప్రవీణ్, జాయింట్ సెక్రెటరీ కెపి సరిత, శివ, రామగుండం యూనిట్ సభ్యులు జగన్, అంజి, అలీ, రత్నం, శ్రీవాణి, స్వాతి, మధురిక, రిట కుమారి, ఉద్యోగులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

హుజూరాబాద్‌రూరల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మందాడిపల్లి గ్రామానికి చెందిన ఓ వృద్ధురాలు చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. కుటుంబసభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎలగందుల కనుకమ్మ(58) అనే వృద్ధురాలు శుక్రవారం తన ఇంటికి వెళ్లేందుకు కరీంనగర్-వరంగల్ ప్రధాన రహదారిని దాటుతున్న క్రమంలో ఓ ద్విచక్ర వాహనదారుడు వేగంగా వచ్చి ఢీకొట్టాడు. రోడ్డుపై పడిపోయిన కనుకమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబసభ్యులు 108లో హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో శనివారం కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. కనుకమ్మ కుమారుడు శ్రీకాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తిరుమల్‌గౌడ్ తెలిపారు.

పెట్రోల్ బంక్ సిబ్బందిపై దాడి.. పోలీసులపై దురుసు ప్రవర్తన

జగిత్యాల క్రైం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో పెట్రోల్ బంక్ సిబ్బందిపై దాడి చేయడంతో పాటు అడ్డుకునేందుకు యత్నించిన పోలీసులపై దురుసుగా ప్రవర్తించిన ఇద్దరి వ్యక్తులపై జగిత్యాల టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ సమీపంలో ఉన్న ఓ పెట్రోల్ బంక్‌లో ధరూర్ గ్రామానికి చెందిన గంగారాం, శేఖర్ అనే ఇద్దరు వ్యక్తులు పెట్రోల్ పోసుకుని డబ్బుల విషయంలో గొడవకు దిగారు. మద్యం మత్తులో సిబ్బందిపై దాడికి పాల్పడ్డారు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చెరుకున్న పోలీసు సిబ్బందిపై దురుసుగా ప్రవర్తించారు. దీంతో పెట్రోల్ బంక్ సిబ్బంది, తమ విధులకు ఆటంకం కలిగించారని పోలీస్ అధికారులు వేర్వేరుగా ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇద్దరు వ్యక్తులపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

గాడి తప్పిన పాలన

- ఖని ప్రభుత్వాసుపత్రిలో ఆర్‌ఎంవోలు వర్సెస్ హెచ్‌వోడీలు
- ప్రిన్సిపాల్ వచ్చినప్పుడే విధుల్లో హెచ్‌వోడీలు..
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన ఆర్‌ఎంవోలు



పెడియాట్రిక్ విభాగాన్ని సందర్శించి వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ శ్రీహర్ష(ఫైల్)

కళ్యాణ్‌నగర్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి) : గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో పాలన గాడి తప్పింది. హెచ్‌వోడీలు సక్రమంగా విధులకు హాజరు కాకపోవడంతో వైద్యం కోసం వచ్చే రోగులు నరకయాతన పడు తున్నారు. వచ్చినా మధ్యాహ్నం 12గంటల వరకే ఓపీ చూసి వెళ్లిపోతున్నారు. మి గతా సమయాల్లో డ్యూటీలో ఉండాల్సిన డాక్టర్లు ఉండడం లేదు. ఆర్‌ఎంవోలు, హెచ్‌వోడీల మధ్య విభేదాలు నెలకొ న్నాయి. హెచ్‌వోడీలు సరిగ్గా విధులకు హాజరుకావడం లేదంటూ కలెక్టర్ కోయ శ్రీహర్షకు ఫిర్యాదు చేయడంతో ఈనెల 23న కలెక్టర్ గోదావరిఖని జనరల్ ఆసుపత్రిని తనిఖీ చేశారు. పిడి యా ట్రిక్, ఆర్థోపెడిక్, ఈఎన్‌టీ వైద్యులు అందు బాటులో లేకపోవ డంతో కలెక్టర్ వివరాలు సేకరించారు. వైద్యులు సమ యపాలన పాటించడం లేదంటూ ప్రిన్సి పాల్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్యులు సమయానికి రాకపోతే చర్యలు తీసుకో వాలని సూచించారు. అయినా కలెక్టర్ ఆదేశాలను లెక్క చేయడం లేదు. జనరల్ మెడిసిన్, పిడియాట్రిక్, జనరల్ సర్జరీ, ఆర్థోపెడిక్, రేడియాలజీ, అనస్తీషియా, ఎమర్జెన్సీ మెడిసిన్, కార్డియాలజీ, యూరాలజీ విభాగాల హెడ్‌లు నిత్యం అందుబాటులో ఉండాలి. కానీ వారంలో రెండు రోజులు మాత్రమే విధులు నిర్వహించి వెళ్లిపోతున్నారు. ప్రిన్సిపాల్ వచ్చినప్పుడు సమాచారం తెలుసుకుని వారు కూడా విధులకు వస్తున్నారు. దీంతో ఆర్‌ఎంవోలు, హెచ్‌వోడీలపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆసుపత్రిలో ఐదుగురు ఆర్‌ఎం వోలు విధులు నిర్వహిస్తున్నారు.

పెరిగిన ఓపీల సంఖ్య..

మెడికల్ కళాశాల ఏర్పాటుతో గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఓపీ సంఖ్య కూడా పెరిగింది. వివిధ రకాల వైద్య సేవల కోసం రోజూ 1200నుంచి 1500మంది అవుట్ పేషెంట్లు వస్తున్నారు. చాలామంది అన్ని విభాగాల వైద్యులు ఉంటారనే ఆశతో దూరప్రాంతాల నుంచి వస్తున్నారు. కానీ ఇక్కడ వైద్యులు మాత్రం 12గంటల వరకే ఓపీ చూసి వెళ్లిపోతుండడంతో నిరాశకు గురవుతున్నారు. వీరిపై సూపరింటెండెంట్ నియంత్రణ చేయాల్సి ఉం డగా పట్టించుకోకపోవడంతో ఆసుపత్రి పాలన గాడి తప్పింది.

సెలవుల్లో అందని వైద్యం..

రెండవ శనివారం, పండుగ సమయాల్లో వరుసగా సెలవులు వస్తే హెచ్‌వోడీలు ముందే వెళ్లిపోతున్నారనే ఆరోపణలున్నాయి. దీంతో రోగులు తీవ్ర నరకయాతన పడుతున్నారు. జూనియర్ వైద్యులే వీరికి దిక్కవుతున్నారు. రాత్రి సమయాల్లో కూడా వైద్యులు ఉండడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. ఏదైనా ఎమర్జెన్సీ కేసులు వస్తే కరీంనగర్, వరంగల్ ప్రభుత్వాసుపత్రికి పంపుతూ చేతులు దులుపుకుంటున్నారు.

● నమోదుకాని బయోమెట్రిక్..

చాలా మంది హెచ్‌వోడీల బయోమెట్రిక్ నమోదు కావడం లేదు. విధులకు సక్రమంగా రాకుండానే చాలామంది ఫోన్‌లలో తమ హాజరును నమోదు చేసుకుంటున్నారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగి ఒకరు హెచ్‌వోడీల హాజరును చూస్తున్నారు. వారు రాకపోయినప్పటికీ రోజూ హాజరును వేస్తున్నారని తెలుస్తోంది.

● ప్రిన్సిపాల్ వస్తేనే విధులకు..

ఖని జనరల్ ఆసుపత్రి బాధ్యతలు కూడా సిమ్స్ ప్రిన్సి పాల్ చూస్తున్నారు. దీంతో కళాశాల పని మీద హైదరా బాద్‌కు వెళిన సందర్భంలో హెచ్‌వోడీలు కూడా వెళ్లిపోతున్నారు. ప్రిన్సిపాల్ తిరిగి వచ్చినప్పుడు వారు కూడా విధులకు వస్తున్నారు. ఇలా నిత్యం జరుగుతున్నా పట్టించుకునేవారే కరువయ్యారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

● ప్రణాళిక లేని వ్యవస్థ..

ఆర్‌ఎంవోలు, హెచ్‌వోడీలను సమన్వయం చేస్తూ వారంవారం సమావేశం ఏర్పాటు చేసి ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, ప్రసవాల పెంపు, ఆసుపత్రికి కావాల్సిన వనరులపై చర్చించాల్సి ఉండగా అలాంటి సమావేశాలు ఇప్పటి వరకు నిర్వహించడం లేదు. ఆసుపత్రిలో రోగులకు కావాల్సిన సౌకర్యాలపై చర్చించడం లేదు. రోగులకు చాలా వరకు సేవలు అందడం లేదు. దీనిపై కలెక్టర్ చొరవ తీసుకుని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో సక్రమంగా వైద్యం అందే విధంగా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

వేర్వేరు కారణాలతో ముగ్గురు యువకుల ఆత్మహత్య

పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాలో వేర్వేరు కారణాలతో ముగ్గురు యువకులు ఆత్మహత్య చేసుకున్నారు. పెద్దపల్లి జిల్లా ఓదెల మండల కేంద్రంలో ఆర్థిక ఇబ్బందులో ఒకరు, ధర్మారం మండలంలోని కమ్మరిఖాన్‌పేటలో జీవితంపై విరక్తి చెంది మరొకరు, కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలంలో అనారోగ్యంతో మరో యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు.

● ఆర్థిక ఇబ్బందులతో..



గంగుల నాగరాజు(ఫైల్)

ఓదెల, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండ ల కేంద్రంలోని 32వ రైల్వే గేట్ సమీపంలో శుక్రవారం రాత్రి ఓదెలకు చెందిన గంగుల నాగరాజు(34) అనే యువకుడు ఆర్థిక ఇబ్బందులతో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య స్వరూప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని ధర్యాప్తు చేస్తున్నట్లు రామగుండం జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ తిరుపతి తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు, అప్పులతో మానసిక వేదనకు గురవుతున్నాడని కుటుంబ సభ్యులు ఫిర్యాదులో పేర్కొన్నట్లు అధికారులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

● జీవితంపై విరక్తి చెంది..



గుజ్జేటి నరేష్ (ఫైల్)

ధర్మారం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మరిఖాన్‌పేటలో గుజ్జేటి నరేష్ (32) అనే యువకుడు ఆర్థిక సమస్యలతో మానసికంగా కుంగిపోయి ఆత్మహత్య చేసుకున్నాడు. కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నరేష్ జీవితంపై విరక్తి చెంది శుక్రవారం ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య తిరుమల, ఓ కుమారుడు, కూతురు ఉన్నారు. మృతుడు నరేష్ తండ్రి లచ్చయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శీలం లక్ష్మణ్ తెలిపారు.

● అనారోగ్యంతో మనస్తాపం చెంది..



కాశిరెడ్డి సాయికృష్ణ(ఫైల్)

హుజూరాబాద్‌రూరల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ మండలంలోని రాంపూర్ గ్రామంలో ఓ యువకుడు అనారోగ్యంతో మనస్తాపం చెంది శనివారం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాంపూర్‌కు చెందిన కాశిరెడ్డి రాజు-రేణుక దంపతులకు కాశిరెడ్డి సాయికృష్ణ(22) ఒక్కడే కుమారుడు. తండ్రి రాజు వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. సాయికృష్ణ ఐటీఐ పూర్తి చేసి ఓ కంట్రాక్టర్ వద్ద కొద్దిరోజుల పాటు పనిచేశాడు. వారం రోజుల క్రితమే ఇంటికి వచ్చాడు.

రెండు మూడు నెలల నుంచి కడుపునొప్పి, ఫిట్స్‌తో బాధపడుతున్నాడు. దీంతో మనస్తాపం చెందాడు. ఈ క్రమంలోనే తల్లిదండ్రులు శనివారం వ్యవసాయ పనులకు వెళ్లిన సమయంలో ఇంట్లో ఒంటరిగా ఉన్న సాయికృష్ణ బాత్రూం గోడకు ఉన్న పైపునకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు గమనించి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. వారు ఇంటికి చేరుకుని గమనించగా అప్పటికే మృతి చెందాడు. సాయికృష్ణ తండ్రి రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తిరుమల్‌గౌడ్ తెలిపారు.

వరకట్న వేధింపులతో యువతి ఆత్మహత్య

కోల్‌సిటీ, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం తేవాలంటూ భర్త వేధించడంతో గోదావరిఖని బాపూజీనగర్‌కు చెందిన మాడుగుల లలిత(18) శనివారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నది. మూడు నెలల క్రితం పాత నేరస్థుడు కాకినాడ కుమారస్వామిని లలిత ప్రేమవివాహం చేసుకున్నది. వివాహం జరిగిన సమయంలో ఆమె మైనర్. తల్లిదండ్రులకు తెలియకుండా కుమారస్వామి సోదరి అంజలి సహకారంతో లలితను వివాహం చేసుకున్నాడు. ఘటనకు సంబంధించి వన్‌టౌన్ పోలీసులు, మృతురాలి కుటుంబసభ్యులు తెలిపిన వివరాలు... బాపూజీనగర్‌కు చెందిన మీనారావు, శారద దంపతులకు ముగ్గురు కూతుళ్లు. మూడో కూతురు లలితను అదే కాలనీకి చెందిన గంజాయి విక్రయదారుడు, పాత నేరస్థుడు కాకినాడ కుమారస్వామి పేరుతో నమ్మించాడు. కుమారస్వామికి అప్పటికే వివాహమై ఇద్దరు పిల్లలున్నారు. తనసోదరి అంజలి సహకారంతో మూడునెలల క్రితం లలితను ఇంట్లో నుంచి తీసుకెళ్లి వివాహం చేసుకున్నాడు. ఆ సమయానికి ఆమె మైనర్. లలితను పెళ్లి చేసుకున్న తరువాత ఆమె తల్లిదండ్రులకు కుమారస్వామి నుంచి వేధింపులు ఎక్కువ కావడంతో వారు మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్‌కు వెళ్లిపోయారు. పెళ్లి చేసుకున్న నెల రోజులకే కుమారస్వామి హత్యకేసులో జైలుకు వెళ్లాడు. బెయిల్‌పై వచ్చిన కుమారస్వామి నిత్యం లలితను వేధించేవాడు. శుక్రవారం లలిత శ్రీరాంపూర్‌లోని తన పుట్టింటికి వెళ్లి కుట్టుమిషన్ తెచ్చుకుంది. తెల్లవారేసరికి మృతి చెందినట్టు కుటుంబసభ్యులు పేర్కొన్నారు. మృతురాలు లలిత తల్లి శారద ఫిర్యాదు మేరకు కుమారస్వామిపై బీఎన్‌ఎస్ 80సెక్షన్ కింద కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ భూమేష్ తెలిపారు.



మాడుగుల లలిత(ఫైల్)

చికిత్స పొందుతూ మహిళ మృతి

- ఆర్‌ఎంపీ నిర్లక్ష్యంతోనేనని కుటుంబసభ్యుల ఆరోపణ
- పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు



ఖాసింబీ (ఫైల్)

గంభీరావుపేట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం సముద్రలింగాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని తుర్కాశిపల్లికి చెందిన ఓ మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆర్‌ఎంపీ వైద్యుడి నిర్లక్ష్యంతోనే మరణించిందని మృతురాలి కుటుంబసభ్యులు ఆరోపించారు. వారి కథనం ప్రకారం.. తుర్కాశిపల్లికి చెందిన ఖాసింబీ (30) గురువారం సాయంత్రం జ్వరంతో బాధపడుతుండగా తిమ్మాపూర్‌కు చెందిన ఆర్‌ఎంపీ వైద్యుడు దేవేందర్ వద్దకు తీసుకెళ్లారు. సైలైన్ పెట్టిన వైద్యుడు ఇంజక్షన్‌లు, టాబ్లెట్స్ ఇచ్చి పంపాడు. జ్వరం తగ్గకపోవడంతో శుక్రవారం ఖాసింబీని మళ్లీ ఆర్‌ఎంపీ వద్దకు తీసుకొచ్చారు. ఆర్‌ఎంపీ చికిత్స ప్రారంభించగా మహిళ పరిస్థితి విషమించడంతో వాహనంలో ఎల్లారెడ్డిపేటలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతుండగా శనివారం తెల్లవారుజామున ఖాసింబి మరణించింది. ఆర్‌ఎంపీ వైద్యుడు దేవేందర్ నిర్లక్ష్యంతోనే ఖాసింబీ మృతిచెందినట్లు కుటుంబస భ్యులు, బంధువులు ఆరోపించారు. ఆర్‌ఎంపీ దేవేందర్ చేసిన వైద్యం వికటించడంతో తన భార్య మృతి చెందిందని ఖాసింబీ భర్త ఎల్లారెడ్డిపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై రమాకాంత్ తెలిపారు.

నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు

- డిప్యూటీ డీఎంహెచ్‌వో ఏంజెలా ఆల్‌ఫ్రెడ్
- ఆర్‌ఎంపీ చికిత్సా కేంద్రం సీజ్



విచారణ చేపట్టిన డిప్యూటీ డీఎంహెచ్‌వో ఏంజెలా ఆల్‌ఫ్రెడ్

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించి వైద్యం అందిస్తే కఠినచర్యలు తప్పవని డిప్యూటీ డీఎంహెచ్‌వో ఏంజెలా ఆల్‌ఫ్రెడ్ హెచ్చరించారు. ఎల్లారెడ్డిపేట మండలం తిమ్మాపూర్‌లోని ఆర్‌ఎంపీ వైద్యుడు దేవేందర్ చికిత్స చేయడంతో గంభీరావుపేట మండలం సముద్రలింగాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని తురాశీపల్లెకు చెందిన ఖాసింబీ మృతి చెందిందని కుటుంబసభ్యులు ఆరోపించడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం విచారణ చేపట్టారు. తిమ్మాపూర్‌లోని చికిత్స కేంద్రం, మెడికల్ దుకాణాన్ని పరిశీలించారు. మహిళకు అందించిన వైద్యంపై ఆరా తీశారు. మృతి గల కారణాలను తెలుసుకున్నారు. ఆర్‌ఎంపీ వైద్యుడు సదరు మహిళకు చికిత్స అందించడంతో పరిస్థితి విషమించి చనిపోయిందని నిర్ధారించారు. ఆర్‌ఎంపీ చికిత్సకేంద్రాన్ని సీజ్‌చేశామని డిప్యూటీ డీఎంహెచ్‌వో ఏంజెల్ ఆల్‌ఫ్రెడ్ పేర్కొన్నారు. లింగన్నపేట వైద్యాధికారి అభినయ్ ఉన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

రాయికల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వస్తాపూర్ గ్రామానికి చెందిన షేక్ మోహిత్ (19) అనే యువకుడు శనివారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. మోహిత్ ఈ నెల 21న కట్కాపూర్ గ్రామ శివారులో మొరం లోడ్‌తో ఉన్న ట్రాక్టర్‌ను నడుపుతుండగా అదుపు తప్పి ట్రాక్టర్ ఇంజన్, టైర్లు పైకి లేచి తన మీద పడ్డాయి. తీవ్ర గాయాలపాలైన మోహిత్‌ను చికిత్సనిమిత్తం హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శనివారం మృతి చెందాడు. మృతుని తండ్రి షేక్ ముజాహిద్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుధీర్ రావు తెలిపారు.

ఇద్దరు పిల్లలతో వివాహిత ఆత్మహత్యాయత్నం

- కాపాడిన పోలీసులు .. దంపతులకు కౌన్సెలింగ్

ధర్మపురి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): భర్తతో గొడవపడి జీవితంపై విరక్తి చెందిన ఓ వివాహిత తన ఇద్దరు పిల్లలతో కలిసి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా పోలీసులు రక్షించారు. భార్య, భర్తలను పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండలంలోని అబ్బాపూర్ గ్రామానికి చెందిన చిప్ప మౌనిక-అరుణ్‌కుమార్ దంప తులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. కొన్ని రోజులుగా దంపతుల మధ్య కుటుంబ కలహాలు మొదలై మనస్పర్థలు ఏర్పడ్డాయి. శనివారం మరోసారి తన భర్తతో గొడవపడిన మౌనిక తన ఇద్దరి పిల్లలను తీసుకుని ధర్మపురి మండలంలోని రాయపట్నం బ్రిడ్జి వద్దకు చేరుకుని ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించింది. అనుమానాస్పదంగా ఇద్దరి పిల్లలతో మహిళ గోదావరి నది వద్ద ఉన్న విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మహిళతో పాటు పిల్లలను రక్షించారు. అనంతరం భర్త అరుణ్‌కుమార్‌తోపాటు మౌనికకు కౌన్సెలింగ్ నిర్వహించారు. సమస్యలకు ఆత్మహత్య పరిష్కారం కాదని క్షణికావేశంలో నిండు జీవితాలను బలిచేసుకోవద్దని వారికి సూచించారు.

డీజే నిర్వాహకులపై కేసు

తంగళ్లపల్లి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాలమల్లుపల్లె గ్రామంలో అర్ధరాత్రి నిబంధనలకు విరుద్ధంగా డీజేతో ప్రజలకు అటంకం కలిగించిన యజమానితో పాటు మరికొందరిపై కేసు నమోదు చేసి డీజేను సీజ్ చేశామని ఎస్‌ఐ శనివారం తెలిపారు. గ్రామంలో డీజేతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని శుక్రవారం అర్ధరాత్రి అక్కడి ప్రజలు సమాచారం ఇచ్చారు. పెట్రోలింగ్ చేస్తున్న హెడ్ కానిస్టేబుల్ కిష్టయ్య తన సిబ్బందితో గ్రామానికి వెళ్లారు. నడిరోడ్డుపై డీజే పెట్టి డ్యాన్స్‌లు చేస్తూ, పోలీసుల విధులకు అటంకం కలిగించిన కందికట్ల సాయి, నల్లవేని రమేష్, నల్లవేని శ్రీనివాస్, అనిమిట్ల రవీందర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, చెలుకల రాజశేఖర్, మరికొంతమందిపై కేసు నమోదు చేసి డీజేను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



ఎడ్ల నర్సయ్య (ఫైల్)

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని రైతు ఎడ్ల నర్సయ్య(68) తన వ్యవసాయ పొలంలో విద్యుదాఘాతంతో శనివారం రాత్రి మృతి చెందాడు. వ్యవసాయ పొలం వద్దకు వెళ్లిన రైతు పొలంలోనే చనిపోవడంతో కుటుంబం, స్థానికంగా విషాదం నెలకొంది. పోలీసులు, కుటుంబసభ్యుల కథనం మేరకు.. గ్రామంలోని నర్సయ్య తనకున్న ఎకరం వ్యవసాయ పొలంలో వరి పంటను సాగు చేస్తూ జీవిస్తున్నాడు. వరి పంట సాగు చేసేందుకు పొలం దున్నాడు. శనివారం సాయంత్రం నర్సయ్య పొలం వద్దకు వెళ్లాడు. విద్యుత్ స్తంభం నుంచి స్టార్టర్ డబ్బాకు వచ్చే సర్వీస్ వైరును కర్రలతో బిగించారు.

పొలంలోకి దిగి పనులు చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు కర్రలకు అమర్చిన విద్యుత్తు స్తంభం నుంచి వచ్చే తీగలు నర్సయ్యపై పడ్డాయి. దాంతో విద్యుదాఘాతా నికి గురై పొలంలోనే ప్రాణాలను వదిలాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు, పోలీసులు అక్కడకు చేరుకున్నారు. పొలం నుంచి మృతదేహాన్ని బయటకు తీశా రు. మృతుడికి భార్య లక్ష్మి, కొడుకులు సందీప్, కృష్ణ, కూతురు నవనీత ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు. బీఆర్‌ఎస్ పట్టణశాఖ అధ్యక్షుడిగా కొనసాగుతున్న మృతుడి పెద్దకొడుకు సందీప్‌ను బీఆర్‌ఎస్ నాయకులు ఓదార్చారు.

రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు

పెద్దపల్లి కల్చరల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపికైనట్టు జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఖోఖో పోటీలకు స్త్రీ, పురుష క్రీడాకారులు ఆదివారం వరంగల్‌లో రిపోర్ట్ చేయాలని, ఫుట్‌బాల్ ఆటలకు హకీంపేట స్పోర్ట్స్ స్కూల్ హైదరాబాద్‌లో పురుషులు రిపోర్ట్ చేయాలన్నారు. వీరికి జిల్లా తరపున టీషర్ట్స్, బస్ పాస్ ఇస్తామని, క్రీడాకారులు ప్రతిభ కనబరిచి విజయం సాధించాలని సూచించారు. ఖోఖో టీం వెంట కోచ్ ఇక్బాల్, ప్రణయ్, మధుకర్, శైలజ వెళ్తున్నట్లు తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు యువకుల మృతి

పెద్దపల్లి, రాజన్నసిరిసిల్ల జిల్లాలో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు యువకులు దుర్మరణం పాలయ్యారు. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలంలో లారీని ద్విచక్రవాహనం ఢీకొట్టగా ఇద్దరు యువకులు మృతి చెందారు. రాజన్నసిరిసిల్ల ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్‌లో ద్విచక్రవాహనం, ట్రాక్టర్ ఢీకొనడంతో మరో యువకుడు దుర్మరణం పాలయ్యాడు.



రాజశేఖర్(ఫైల్)



సంతోష్ నాయక్(ఫైల్)



రాజేశ్(ఫైల్)

● ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన ద్విచక్రవాహనం..

ధర్మారం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రోడ్డుప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. చీకట్లో ఆగి ఉన్న లారీని బైక్‌పై వెళుతున్న ఇద్దరు యువకులు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటన లంబాడితండా(బి) గ్రామంలో విషాదం నింపింది. వివరాల్లోకి వెళితే.. శుక్రవారం గ్రామానికి చెందిన యువకులు సున్నావత్ రాజశేఖర్(27), బానోత్ సంతోష్ నాయక్(25) ధర్మారంలోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌కు బంధువులను చూడడానికి వెళ్లారు. తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో లంబాడితండా(బి) వద్ద మెయిన్‌రోడ్డుపై మంచిర్యాలకు చెందిన డ్రైవర్ మోహమ్మద్ ఫారూఖ్ తన లారీని లైట్స్ వేయకుండా రోడ్డుపై నిలిపాడు. రాత్రి సయమం కావడంతో చీకట్లో లారీని ఢీకొట్టారు. బైక్ నడుపుతున్న సంతోష్‌నాయక్ తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందగా, వెనక కూర్చున్న రాజశేఖర్‌కు ముఖంపై గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం రాజశేఖర్‌ను హాస్పిటల్‌కు తలిస్తున్న క్రమంలో మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడు రాజశేఖర్‌కు భార్య సునీతతో పాటు 18 నెలల పాప ఉంది. సంతోష్ నాయక్‌కు భార్య ప్రత్యూష, 16 నెలల కుమారుడు జైష్వన్ ఉన్నారు. మృతుడు రాజశేఖర్ భార్య సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శీలం నరేష్ తెలిపారు.

● ట్రాక్టర్, ద్విచక్రవాహనం ఢీ..

ఎల్లారెడ్డిపేట (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామశివారులోని కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై శనివారం రాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ సంఘటనలో వేములవాడ అర్బన్ మండలం చింతలఠాణా ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి చెందిన గోగులకొండ రాజేష్(30) అనే యువకుడు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. ఎల్లారెడ్డిపేట నుంచి సిరిసిల్ల వైపునకు వెళుతున్న సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి తన వాహనాన్ని ఆపి ప్రమాద స్థలానికి చేరుకున్నారు. 108 వాహనానికి సమాచారం అందించి రాజేష్‌ను సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు, ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు.. వేములవాడ మండలం చింతలఠాణాకు చెందిన యువకుడు గోగులకొండ రాజేష్ తన ద్విచక్రవాహనంపై వీర్నపల్లి మండలం మద్దిమల్లలోని అత్తగారింటికి వెళ్లాడు. ముస్తాబాద్ మండలం ఆవునూరుకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ నర్సయ్య కేజ్‌వీల్‌తో వెంకటాపూర్ నుంచి స్వగ్రామానికి బయలుదేరాడు. యువకుడు రాజేష్ తిరుగు ప్రయాణంలో ద్విచక్ర వాహనంతో ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొట్టాడు. దాంతో ఒక్కసారిగా ఎగిరిపడి మృతి చెందాడు. 108 వాహనంలో అతన్ని సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎన్‌టి సత్తయ్య, వాహన పైలట్ కుమారస్వామి మృతుడి వద్ద ఉన్న రూ 356 నగదు, సెల్ ఫోనును ఆసుపత్రిలోని అవుట్ పోస్ట్ అధికారులకు అప్పగించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని ఎస్సై రమాకాంత్ వివరించారు. మృతుడికి భార్య, అపర్ణ, కూతురు సాన్విక, కొడుకు రిష్‌వర్ధన్ ఉన్నారు.



రాజేష్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

వసూళ్ల దందా వీడియో వైరల్



అధికారి కారులో వెళ్తున్న రిటైర్డ్ ఉద్యోగి

సిరిసిల్ల, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): హోటళ్లు, కిరాణాదుకాణాలు, టిఫిన్ సెంటర్లు, స్వీట్ షాప్‌లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లతోపాటు వివిధ వ్యాపార సంస్థల్లో కల్తీ జరగకుండా నిఘా పెట్టాల్సిన వారే వసూళ్ల దందాకు పాల్పడడం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. శనివారం రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌కు చెందినవారు హోటళ్లు, కిరాణా దుకాణాల్లో డబ్బులు వసూలు చేయడంపై కొంతమంది వీడియోలు తీసి సోషల్ మీడియాలో పోస్టు చేశారు.

దుకాణాల వద్దకు వెళ్లి ముడుపుల కవర్లను తీసుకొని ప్రభుత్వ వాహనంగా ఉన్న కారులో వెళ్లడాన్ని గమనించారు. రిటైర్డ్ ఉద్యోగిని ప్రైవేట్ అసిస్టెంటుగా పెట్టుకొని ఓ మహిళా అధికారి వసూళ్లు చేస్తున్నట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు.

విప్లవ శక్తులు ఏకం కావాలి



మాట్లాడుతున్న న్యూడెమోక్రసీ జాతీయ ప్రతినిధి దర్శన్‌సింగ్ కట్కర్

గోదావరిఖని, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): దేశంలోని విప్లవ శక్తులన్నీ ఏకం కావాల్సిన అవసరం ఉందని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జాతీయ అధికార ప్రతినిధి దర్శన్‌సింగ్ కట్కర్ అన్నారు. శనివారం హైదరాబాద్ సుందరయ్య భవన్‌లో జరిగిన న్యూడెమోక్రసీ విప్లవ గ్రూప్‌ల విలీనం కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. దశాబ్దకాలంగా న్యూడెమోక్రసీ పార్టీల ఐక్యత ప్రయత్నాలు జరిగాయన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో బలమైన రెండు విప్లవ స్రవంతులు ఐక్యంకావడం విప్లవోద్యమానికి మరింత బలాన్ని చేకూర్చుతుందని అభిప్రాయపడ్డారు. ఈ ఐక్యత దేశవ్యాప్తంగా ఉన్న విప్లవ పార్టీలు చీలికలతో జరిగిన నష్టాన్ని గుర్తించి పునరాలోచించే విధంగా ఉంటుందన్నారు. దేశవ్యాప్తంగా పెరుగుతున్న ఫాసిస్టు ధోరణిలను నిలువరిచేందుకు విప్లవకారులు, సంస్థలు ఒకే పార్టీగా ఏర్పడాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. దేశ ప్రజల మధ్య ఉన్న సోదరభావాన్ని బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్, ఫాసిస్టు శక్తులు దెబ్బతీస్తున్నాయని చెప్పారు. బీజేపీ పాలన అంతా కార్పొరేట్లకు కొమ్ముకాసి పేదలపై పన్నుల భారాన్ని మోపుతోందన్నారు. సామాజికంగా, ఆర్థికంగా, సాంస్కృతికంగా దాడి చేస్తున్నదని, దీన్ని నిలువరించేందుకు ఇండియా కూటమి దృఢంగా నిలువలేకపోయిందన్నారు. సమావేశంలో పాల్గొన్న న్యూడెమోక్రసీ జాతీయ నాయకులు వేములపల్లి వెంకట్రామయ్య, సాదినేని వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ ఉద్యమం కోసం అనేక మంది విప్లవకారులు అమరుల య్యారని, వారి త్యాగాల పోరాటాల వారసత్వాన్ని కొనసాగిస్తామని చెప్పారు. విలీన సభలో న్యూడెమోక్రసీ పార్టీల నాయకులు వై సాంబశివరావు, జేవీ చలపతిరావు, చిట్టిపాటి వెంకటేశ్వర్లు, డీ ప్రసాద్, కే గోవర్ధన్, జీ ఝాన్సీ, వీ సంధ్య, ఆవునూరి మధు, సీఎస్ సాగర్ పాల్గొన్నారు. ఈ విలీన సభకు ముందు న్యూడెమోక్రసీ పార్టీల శ్రేణుల ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో భారీ ప్రదర్శన జరిగింది. అనంతరం న్యూడెమోక్రసీ పార్టీ పతాకాన్ని పార్టీ సీనియర్ నాయకుడు కోటేశ్వర్‌రావు ఎగురవేశారు.

ఉద్యమకారుల చరిత్ర రాయాలి


కవులను సన్మానిస్తున్న ఓరుగంటి ఆనంద్

కరీంనగర్ కల్చరల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కరీంనగర్ జిల్లా తెలంగాణ ఉద్యమకారుల చరిత్ర రాయాలని జిల్లా ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర సలహాదారు, ఆహార భద్రత కమిటీ సభ్యుడు ఓరుగంటి ఆనంద్ అన్నారు. శనివారం కరీంనగర్‌లో ఉమ్మడి జిల్లా కవులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జీవిత చరిత్ర రాయాలని కోరారు. త్వరలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఉద్యమకారుల డైరీని ముద్రిస్తామని అన్నారు. అనంతరం కవులను సన్మానించారు. కార్యక్రమంలో ఫోరం జిల్లా అధ్యక్షులు కనకం కుమారస్వామి, అయిలోని ప్రసన్న, బోగె పద్మ రవీందర్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ జోగిరెడ్డి, కవులు, ఉద్యమకారులు పాల్గొన్నారు.

మొక్కజొన్నపై 'కత్తెర' పంజా



జగిత్యాల జిల్లాలో ఇప్పటికే వేల ఎకరాల్లో పంట నష్టం
- మేల్కొనకపోతే ఇబ్బందులు
- నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలుంటున్న శాస్త్రవేత్తలు

జగిత్యాల, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న పంటపై కత్తెర పురుగు పంజా విసురుతోంది. మొలక దశలో నుంచే పురుగు ఉధృత స్థాయిలో దాడి చేస్తోంది. దీని నివారణ రైతులకు ఆర్థికభారంగా మారుతోంది. జగిత్యాల జిల్లా వ్యాప్తంగా సుమారు 40



వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగవుతోంది. వరి పంటను కోసిన తరువాత పొలాలు దున్నకుండానే మొక్కజొన్న విత్తారు. సుమారు 5 వేల ఎకరాల్లో కత్తెర పురుగు ఆశించిందని అన్నదాతలు అంటున్నారు. మొక్కదశ నుంచే పంటను నాశనం చేస్తుండడంతో రైతులు లబోదిబోమంటున్నారు. పురుగు మందు పిచికారి చేస్తున్నప్పటికీ ఫలితం ఉండడం లేదని వాపోతున్నారు. ఒక్కో మొక్కలో పదుల సంఖ్యలో కత్తెర పురుగులు కనిపిస్తున్నాయి. పురుగు పట్టడంతో మొక్క ఆకులకు రంధ్రాలు పడడం, కుళ్లిపోవడం వంటివి జరుగుతున్నాయంటున్నారు. పురుగు మొగిలోకి చొరబడి పంటను ఎదగకుండా చేస్తోందంటున్నారు. దీంతో పంట నష్టపోయే ప్రమాదం ఉంది. ఇప్పటికే ఎకరానికి రూ. 15 వేల నుంచి రూ. 20 వేల మధ్యలో పెట్టుబడి పెట్టామని, ప్రస్తుతం కత్తెర పురుగు నివారణకు మరింత మొత్తంలో వెచ్చించాల్సిన పరిస్థితి నెలకొంటోందని ఆందోళన చెందుతున్నారు. కత్తెర పురుగుతో ఒక్కో రైతు కనీసం ఎకరానికి రూ. 10 వేల వరకు వ్యయం చేయాల్సి వస్తోంది. ఇప్పటికే పలువురు రైతులు రెండు, మూడుసార్లు రసాయన మందులు పిచికారి చేశారు. పిచికారి చేసేందుకు కూలీల ఖర్చు కూడా రైతులు భరించాల్సి వస్తోంది. అయినప్పటికీ పురుగు ఉధృతి ఆగకపోవడంతో ఆందోళనకు గురవుతున్నారు. మునుముందు మొక్కజొన్న దిగుబడిపై ప్రభావం పడి దిగుబడి తగ్గిపోయే ప్రమాదం పొంచి ఉండడంతో రైతులు నిరాశకు గురవుతున్నారు.

● అన్నదాతల్లో ఆందోళన..

జగిత్యాల జిల్లాలో మొక్కజొన్నపై కత్తెర పురుగు దాడి చేస్తుండడం రైతన్నలను ఆందోళనకు గురి చేస్తోంది. కత్తెర పురుగు జీవిత కాలం సుమారు నెల రోజులుంటుందని, ఇది సుమారు 1,300 నుంచి 2,000 వరకు గుడ్లు పెడుతుంది. గుడ్ల నుంచి బయటకు వచ్చిన తరువాత పురుగులు మొక్క ఆకులను తింటుండడంతో ఆకులకు రంధ్రాలు పడుతుంటాయి. పురుగు పెద్దది అవుతున్న కొద్ది పంటను మరింత నాశనం చేస్తుంటాయి.


మొక్కజొన్న పంటను ఆశిస్తున్న పురుగు

పెట్టుబడి వచ్చే పరిస్థితి లేదు..
- బొక్కల నాగయ్య, మొక్కజొన్న రైతు, గ్రామం లక్ష్మీదేవిపల్లి, జగిత్యాల



రెండు ఎకరాల్లో మొక్కజొన్న వేశాను. కొద్ది రోజుల్లోనే కత్తెర పురుగు సోకింది. పురుగు నివారణకు రెండు సార్లు మందు పిచికారి చేశాను. ఇందుకోసం రూ. 4 వేల వ్యయం అయింది. రెండెకరాలకు రూ. 8 వేల పెట్టుబడి పురుగుల మందులకే ఖర్చు చేయాల్సి వచ్చింది. ప్రస్తుతం పెట్టుబడులు కూడా రాని పరిస్థితి ఉంది.

లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలి..
- శ్రీనివాస్, సీనియర్ శాస్త్రవేత్త, పొలాస పరిశోధన స్థానం డైరెక్టర్, జగిత్యాల

మొక్కజొన్న పంటపై కత్తెర పురుగు దాడి ఉధృతిని తట్టు కోవడానికి రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి. లింగాకర్షక బుట్ట లు ఏర్పాటు చేసుకోవాలి. గుడ్ల దశలోనే నివారిస్తే పెద్దగా ఇబ్బంది ఉండదు. గుడ్ల నుంచి పిల్ల పురుగులు బయటకు వచ్చిన తరువాత ఎక్కువ నష్టం కలుగుతుంది. మధ్యస్థ దశ లో కత్తెర పురుగు నివారణకు వేపనూనె పిచికారి చేయాలి.

డిగ్రీ పరీక్షల్లో 25 మంది డీబార్

గణేశ్‌నగర్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో జరుగుతున్న డిగ్రీ మూడో, ఐదో సెమిస్టర్ పరీక్షల్లో శనివారం 25 మంది విద్యార్థులు డీబార్ అయినట్లు శాతవాహన యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్వీ శ్రీరంగప్రసాద్ తెలిపారు. ట్రినిటి డిగ్రీ కళాశాల, కరీంనగర్‌లో ఒకరు, ప్రభుత్వ ఉమెన్స్ డిగ్రీ కాలేజ్ కరీంనగర్‌లో ఒకరు, వాణికేతన్ డిగ్రీ కళాశాల కరీంనగర్‌లో ఆరుగురు, వాగేశ్వరి డిగ్రీ కళాశాల కరీంనగర్‌లో ఐదుగురు, శ్రీచైతన్య ఉమెన్స్ డిగ్రీ కళాశాల కరీంనగర్‌లో ఇద్దరు, శ్రీచైతన్య డిగ్రీ కళాశాల కరీంనగర్ లో ఒకరు, శివాని డిగ్రీ కళాశాల కరీంనగర్‌లో ఏడుగురు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల హుజూరాబాద్‌లో ఒకరు, రామకృష్ణ డిగ్రీ కళాశాల జగిత్యాలలో ఒకరు డీబార్ అయినట్లు పేర్కొన్నారు.

జాతీయస్థాయి రగ్బీ పోటీలకు వెల్ది పాఠశాల విద్యార్థి


హర్షవర్ధన్

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): బీహార్ రాష్ట్రంలోని పాట్నాలో జనవరి 1 నుంచి 4వ తేదీ వరకు నిర్వహించనున్న జాతీయస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-14 రగ్బీ పోటీలకు మానకొండూర్ మండలం వెల్ది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి బి హర్షవర్ధన్ ఎంపికయ్యాడు. ఇటీవల మహబూబ్‌నగర్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్-14 ఎస్‌జీఎఫ్ రగ్బీ పోటీల్లో ప్రతిభ చాటిన హర్షవర్ధన్ జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్టుకు ఎంపిక య్యాడని పాఠశాల పీడీ ఎండీ యూనిస్ పాష తెలిపారు. హర్షవర్ధన్‌ను డీఈవో సీహెచ్‌వి జనార్దన్‌రావు, జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి వేణుగోపాల్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ తదితరులు అభినందించారు.

రాజన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు


రాజన్న దర్శనం కోసం క్యూలో ఉన్న భక్తులు

వేములవాడ కల్చరల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. శనిత్రయోదశిని పురస్కరించుకుని ఇతర ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. రాజన్న ఆలయ ధర్మగుండంలో స్నానాలు ఆచరించిన భక్తులు కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. ధర్మదర్శనం, శీఘ్రదర్శనం క్యూలైన్‌ల ద్వారా భక్తులు సుమారు రెండు గంటలకు ఆలయంలోకి చేరుకుని రాజన్నను దర్శించుకున్నారు. అనంతరం కోడెమొక్కును చెల్లించుకున్నారు. రాజన్న అనుబంధ ఆలయమైన భీమేశ్వరస్వామి వారి ఆలయంలోని శనీశ్వరుడికి అర్చకులు ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో శనీశ్వరుడి వద్దకు చేరుకుని స్వామి వారికి నల్లవస్త్రం సమర్పించి, నువ్వుల నూనెతో దీపాలను వెలిగించారు.

● వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారిని స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా హైదరాబాద్ సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ రాజేష్‌కుమార్ దర్శించుకున్నారు. శని వారం రాజన్న ఆలయానికి వచ్చిన ఆయన ప్రత్యేకపూజలో పాల్గొన్నారు. అనంతరం నాగిరెడ్డి మండపంలో అర్చకులు ఆశీర్వదించగా, ఆలయ సూపరింటెండెంట్ తిరుపతిరావు రాజన్న చిత్రపటాన్ని అందజేశారు.

నానో ఎరువులను వినియోగించాలి

» పెట్టుబడి తగ్గడంతో పాటు భూసార పరిరక్షణ » భారతీయ బీజ్ సహకార సమితి చైర్మన్ యోగేంద్రకుమార్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యోగేంద్రకుమార్, కొండూరి రవీందర్‌రావు

మానకొండూర్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): నానో (ద్రవ రూప) ఎరువులను వినియోగించడం వల్ల సాగు ఖర్చు తగ్గడంతో పాటు భూసార పరిరక్షణ ఉంటుందని భారతీయ బీజ్ సహకార సమితి చైర్మన్ యోగేంద్రకుమార్ అన్నారు. మానకొండూర్‌లో ఇఫ్కో నానో ఎరువుల వినియోగంపై కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, సిరిసిల్ల జిల్లాలోని విత్తన ఉత్పత్తిదారులు, ఆర్గనైజర్ల శిక్షణ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రసాయన ఎరువుల వాడడం వల్ల భూసారం తగ్గిపోయి పంట దిగుబడి తక్కువగా వస్తుందన్నారు. నానో ఎరువుల వాడకం వల్ల ఎకరానికి రూ. 3వేల పెట్టుబడి తగ్గడమే కాకుండా భవిష్యత్తు తరానికి సారవంతమైన భూమిని అందించే అవకాశం ఉంటుందని చెప్పారు. నానో డీఏపీ వల్ల మొక్కకు త్వరగా పోషకాలు అందుతాయన్నారు. వరి పంటకు డ్రోనుల ద్వారా ఎరువు లు పిచికారి చేసుకుంటే పెట్టుబడితో పాటు సమయం ఆదా అవుతుందన్నారు. నేషనల్ అగ్రికల్చర్ కో-ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ కొండూరి రవీందర్‌రావు మాట్లాడుతూ దేశంలోని సహకార సంఘాల్లో నానో ఎరువులతో పాటు డ్రోనులను అందుబాటులో ఉంచేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అనంతరం నానో ఎరువుల వినియోగం వల్ల చేకూరు ప్రయోజనాల పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సైంటిస్టు గోపీనాథ్, జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి, రమణారావు, శ్రీనివాస్‌రెడ్డి, కృపాశంకర్, ఇఫ్కో జిలా మేనేజర్ బాలాజీ ఉమ్మడి జిల్లా ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయికి ఎదగాలి

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): జూడో క్రీడలో రాణించి అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. కరీంనగర్‌లోని ప్రాంతీయ క్రీడా పాఠశాలలో రెండు రోజులుగా జరుగుతున్న సీఎం కప్ 2024 రాష్ట్రస్థాయి జూడో పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. శనివారం పోటీలను జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి వి శ్రీనివాస్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రాష్ట్ర స్థాయి జూడో పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. సీఎంకప్ రాష్ట్రస్థాయి జూడో పోటీల సందర్భంగా పలు వెయిట్ కేటగిరీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులను తెలంగాణ ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి జనార్దన్‌రెడ్డి, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చిట్టిమల్ల శ్రీనివాస్, టీఎన్‌జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి, కోట ఇనిస్టిట్యూషన్స్ అధినేత అంజిరెడ్డిలు అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆత్మస్థైర్యానికి జూడో క్రీడ దోహదప డుతుందని, అమ్మాయిలందరూ తప్పకుండా జూడోలో శిక్షణ పొందాలని అన్నారు. శనివారం పతకాల పటట్టికలో కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలు ముం దంజలో ఉండగా హైదరాబాద్, గద్వాల్, భూపా లపల్లి, వికారాబాద్, వరంగల్, నల్గొండ జిల్లాలు సైతం పతకాలను సాధించాయి. ఈ కార్యక్రమంలో టీఎన్‌జీవోల సంఘం బాధ్యులు కాళీ చరణ్, ప్రవీణ్, జేఎఫ్ఐ కోశాధికారి కైలాసం యాదవ్, టెక్నికల్ కమిటీ చైర్మన్, తెలంగాణ ఒలంపిక్ సంఘం సభ్యులు, సిలివేరి మహేందర్, కేజేఏఫ్ జిల్లా కార్యదర్శి బి వేణుగోపాల్, పోటీల ఇన్‌చార్జి ఎన్ రాజు, మార్వాడి సుదర్శన్, యువజన సంఘాల నాయకుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


జూడో పోటీలో తలపడుతున్న బాలికలు

యువకుడి ఆత్మహత్య

కోరుట్ల, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నందీ చౌరస్తాలో అద్దెకు నివాసం ఉంటున్న మెట్‌పల్లి పట్టణానికి చెందిన కంభంపాటి వినయ్ (34) అనే యువకుడు అప్పుల బాధతో ఉరి వేసుకుని శనివారం ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. వినయ్ భార్య తన తల్లి గారి ఇంటికి వెళ్లడంతో రెండు రోజుల నుం చి ఇంట్లో ఒక్కడే ఉంటున్నాడు. వినయ్ వివి. ద వ్యాపారాలలో డబ్బులు పెట్టి నష్టపో యాడు. సమారు రూ. 50 లక్షల వరకు అప్పులు ఉన్నాయి. ఈ క్రమంలో శనివారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వినయ్ తండ్రి దామోదర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలు

సుల్తానాబాద్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : సుల్తానాబాద్ పట్టణంలో రాజీవ్ రహదారిపై జరిగిన ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. సుల్తానాబాద్ బస్టాండ్ సమీపంలో రాజీవ్ రహదారి దాటుతున్న గుర్తు తెలియని వ్యక్తిని లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో యువకుడు తలకు తీవ్ర గాయమైంది. సమాచారం అందుకున్న ఎస్‌ఐ శ్రావణ్ కుమార్ అక్కడకి చేరుకుని ఆటోలో అతడిని సుల్తానాబాద్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతను స్పృహలో లేకపోవడంతో అతను ఎవరనేదీ తెలియరాలేదు. ప్రాథమిక చికిత్స అనంతరం గుర్తు తెలియని వ్యక్తిని కరీంనగర్ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

పల్లెటూరి పిలగాడు.. పట్టుదలతో గెలిచాడు

యూట్యూబ్‌లో చూసి.. ఆటలో మెళకువలు
- అంతర్జాతీయ స్థాయి ఖోఖోలో ప్రతిభ
- బంగారు పతకం సాధించిన కోరుట్లపేట విద్యార్థి

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఆ చిన్నోడికి ఆటలంటే ప్రాణం.. బాల్యం నుంచి ఆటే ధ్యాస. వసతులు లేకున్నా దిగులు చెందలేదు. పొలాన్నే మైదానంగా.. సెల్‌ఫోన్‌లోని యూట్యూబ్‌ను వేదికగా చేసుకొని ఖోఖోలో మెళకువలు నేర్చుకున్నాడు. పట్టుదల.. అకుంఠిత దీక్ష ఆ విద్యార్థిని అత్యుత్తమంగా రాణించేలా చేశాయి. అంతర్జాతీయ స్థాయికి ఎదిగి తనదైన ఆట తీరుతో అదుర్స్ అనిపిస్తున్నాడు.

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం కోరుట్లపేటకు చెందిన విద్యార్థి తాడ వంశీధర్‌రెడ్డి అంతర్జాయతీ ఖోఖోలో రాణిస్తున్నాడు. వంశీధర్‌రెడ్డి తల్లిదండ్రులది వ్యవసాయ కుటుంబం కావడంతో వారితో పాటే పొలం పనులు చేస్తూ ఇంటర్ విద్యను పూర్తి చేశాడు. చిన్నతనం నుంచి చదువుతో పాటు ఆటల్లో ముందుండేవాడు. ఖోఖోపై మక్కువ పెంచుకున్నాడు. వసతులు లేకపోయినా పొలం వద్ద ఉన్న ఖాళీ స్థలంలో ప్రాక్టీస్ చేసేవాడు. ఆటలో మరింత రాణించాలనే లక్ష్యంతో సెల్‌ఫోన్ ద్వారా యూట్యూబ్‌ను వేదికగా చేసుకున్నాడు. నిత్యం అందులో ఖో-ఖో ఆటలో మెళకువలను నేర్చుకున్నాడు. వంశీధర్‌రెడ్డిలోని ఆట ప్రతిభ పాఠశాల నుంచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యేలా చేసింది. వరంగల్‌లో రూరల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రెండేళ్ల కిందట నిర్వహించిన అండర్-17 రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో ప్రతిభ కనబర్చాడు. తెలంగాణ జట్టు నుంచి ఏడాది కిందట గుజరాత్‌లోని జామ్నగర్‌లో రూరల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో, భారత్ జట్టు నుంచి అదే ఏడాది నేపాల్ రాజధాని ఖాట్మండ్‌లో జరిగిన అంతర్జాతీయ పోటీల్లో పాల్గొన్నాడు. నేపాల్ జట్టుపై భారత్ జట్టు విజయం సాధించడంతో బంగారు పతకం అందుకున్నాడు.


పతకం అందుకుంటున్న వంశీధర్‌రెడ్డి



పతకంతో వంశీధర్‌రెడ్డి

ఏషియన్ గేమ్స్ లక్ష్యం
- వంశీధర్‌రెడ్డి, క్రీడాకారుడు

మాది కోరుట్లపేట. నిరుపేద వ్యవసాయ కుటుంబం. ఖోఖో ఆట అంటే ఇష్టం. శిక్షణ, వసతులు లేకపోయినా ఆట ఆడి తీరాలనే పట్టుదల ఉండేది. మా పొలం వద్దనే ప్రాక్టీస్ చేసేవాడిని. మరిన్ని మెళకువల కోసం యూట్యూబ్‌ను వినియోగించుకున్నా. అందులో చూసి నేర్చుకున్నా. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఆడి సత్తా చాటాను. ప్రభుత్వం ప్రోత్సహిస్తే ఏషియన్ గేమ్స్ ఖోఖోలో ఆడి విజయం సాధించాలనేది లక్ష్యం.

విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వం

● ఏబీవీపీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు అంజన్న

గణేశ్‌నగర్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): విద్యా వ్యవస్థను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని ఏబీవీపీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు జెల్లపెల్లి అంజన్న విమర్శించారు. శాతవాహన యూనివర్సిటీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఏబీవీపీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన సంక్షేమ హాస్టళ్లు సమస్యలకు నిలయాలుగా మారాయని ఆరోపించారు. రాష్ట్రంలో ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా ఏబీవీపీ విద్యార్థుల పక్షాన పోరాటం చేస్తుందన్నారు. సిద్దిపేటలో ఈనెల 23, 24, 25 తేదీల్లో జరిగే రాష్ట్ర మహాసభల్లో విద్యా రంగ సమస్యలపై ఆమోదించిన తీర్మానాలను ప్రభుత్వానికి పంపిస్తామన్నారు. ఇతర రాష్ట్రాల్లో విద్యకు 14 శాతం నిధులు కేటాయిస్తే, తెలంగాణలో 7శాతం నిధులు కేటాయించడం సరికాదన్నారు. గురుకులాల్లో విద్యార్థులు ఫుడ్ పాయిజన్‌తో చనిపోతున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రైవేటు యూనివర్సిటీలను కాంగ్రెస్ ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని ఆయన ఆరోపించారు. సమావేశంలో స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ గంట కిరణ్మయి, యూనివర్సిటీ ప్రెసిడెంట్ బాలకృష్ణ, యూనివర్సిటీ జాయింట్ సెక్రెటరీ పూజ, సాత్విక కార్యకర్తలు శివ, వంశి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏబీవీపీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు అంజన్న

న్యూస్ బాక్స్

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

ఓదెల, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఆటో డ్రైవర్‌లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ఉల్లంఘించినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పొత్కపల్లి ఎస్ఐ రమేష్ అన్నారు.పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఆటో డ్రైవర్‌లకు మీ కోసం అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ డ్రైవర్లు 18ఏళ్లు పైబడిన వాళ్లే ఆటోలు, వాహనాలు నడపాలని, ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. ప్రతి ఆటోకు వాహన ఇన్స్యూరెన్స్, పొల్యూషన్ ఇతర ధ్రువీకరణ పత్రాలు దగ్గర ఉంచుకోవాలని పరిమితి 5 కంటే ఎక్కువ ప్రయాణికులను తీసుకెళ్లవద్దన్నారు. అనుమానిత వ్యక్తులు ప్రయాణిస్తే వెంటనే సమాచారం అందించాలన్నారు.

అవార్డుకు ఎంపిక

కోల్‌సిటీటౌన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భారత్ భూషణ్ అవార్డుకు గోదావరిఖనికి చెందిన స్వచ్ఛంద సంఘాల నిర్వాహకులు ఈదునూరి శంకర్ ఎంపికయ్యారు. ఈ మేరకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గ్లోబల్ ఫౌండేషన్ న్యూఢిల్లీ నిర్వాహకులు డాక్టర్ మనీష్‌గవాయి, ఇండియన్ గెలాక్సీ ఫౌండేషన్ న్యూఢిల్లీ నిర్వాహకులు ప్రియాంక సాతే ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 3న న్యూఢిల్లీలోని న్యూమహారాష్ట్ర సదన్ నిర్వహించే కార్యక్రమంలో కేంద్ర మంత్రి రాందాస్ హత్వాలే నుంచి శంకర్ అవార్డు అందుకోనున్నారు.

డ్రంకెన్ డ్రైవ్

సుల్తానాబాద్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు తప్పవని పోలీసులు హెచ్చరించారు. సుల్తానాబాద్ పట్టణంలో శనివారం రాజీవ్ రహదారితో పాటు పలు ప్రధాన చౌరస్తాల వద్ద ట్రాఫిక్ పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. వాహనాలను తనిఖీ చేస్తూ ట్రాఫిక్ నిబంధనలు వివరించారు. ఉల్లంఘించిన వారికి జరిమానాలు విధించడంతో పాటు కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ రవికాంత్ న్నారు.

అతిథులుగా వచ్చారు..

రామగిరి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): మంచిర్యాల, గోదావరిఖని ఏసీపీలు అధికారులుగా కాకుండా అతిథిలుగా తన ఇంటికి వచ్చారని బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తొట్ల తిరుపతియాదవ్ అన్నారు. శనివారం తర నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంథని బీఆర్ఎస్ నాయకుడు వ్యక్తిగత విషయాల్లోకి తొంగిచూస్తున్నాడని ఆరోపించారు. ఇటీవల తాను కంటికి శస్త్రచికిత్స చేసుకున్న క్రమంలో వ్యక్తిగతంగా పరిచయం ఉన్న ఏసీపీలు పరామర్శించేందుకు రాగా మర్యాద పూర్వకంగా సత్కరించానని, అందులో తప్పేంటని ప్రశ్నించారు. పోలీసుల అధికారులకు కండువాలు వేసే సంస్కృతి ఆయనదని ఎద్దేవా చేశారు. ఈ సమావేశంలో నాయకులు తోట చంద్రయ్య, రోడ్డబాపు, బర్ల శ్రీనివాస్, చిందంమహేష్, తులసిరాం గౌడ్, తీగల సమ్మయ్య, మైదం వరప్రసాద్, గంట వెంకటరమణరెడ్డి, ముస్త్యాల శ్రీనివాస్, మురళి, కనకయ్య, దాసరిశివ, ఎగొలపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'కృష్ణవేణి'లో క్రీడాపోటీలు

కోల్‌సిటీటౌన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖనిలోని కృష్ణవేణి విద్యాసంస్థల్లో శనివారం విద్యార్థులకు క్రీడాపోటీలను ప్రారంభించారు. జనవరి 3వ తేది వరకు క్రీడా పోటీలు జరుగుతాయని విద్యాసంస్థల డైరెక్టర్ మంజులాశ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పీఈటీలు పాల్గొన్నారు.

ఒంటికాలిపై ఎస్ఎస్ఏ ఉద్యోగుల నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

పెద్దపల్లి రూరల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పెద్దపల్లి ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఎస్ఎస్ఏ ఉద్యోగుల చేస్తున్న సమ్మెలో భాగంగా శనివారం ఒంటికాలిపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకుడు కుంభాల సుధాకర్ మాట్లాడుతూ ఎస్ఎస్ఏలో కాంట్రాక్టు పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న వారిని రెగ్యులర్ చేస్తానని సీఎం రేవంత్‌రెడ్డి హామీ అమలు చేయడం లేదన్నారు. ఇచ్చిన హామీలను అమలుచేయాలని డిమాండ్ చేశారు. 19 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్న ప్రభుత్వంలో ఎలాంటి స్పందన లేకుండా పోయిందని, హామీలను నేరవేర్చేవరకు పోరాటం ఆగదన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్‌కుమార్, రామగిరి రవిరాజ్, నాగరాజు, పిల్లి రమేష్, శ్రీకాంత్, రవిందర్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన నేత్ర చికిత్స

కళ్యాణ్‌నగర్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): రామగుండంలో ప్రజలకు మెరుగైన నేత్ర చికిత్సను అందించడానికి దుర్గాప్రసాద్ నేత్రాలయం అందుబాటులో ఉంటుందని ఐఎంఏ అధ్యక్షుడు క్యాస శ్రీనివాస్ అన్నారు. శనివారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో నూతన సంవత్సర క్యాలెండర్‌ను వైద్యులు దుర్గాప్రసాద్, నాగిరెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి ఉద్యోగులు కూడా ఈ నేత్రాలయాన్ని వినియోగించుకోవచ్చని, ఐఎంఏ ఆధ్వర్యంలో రామగుండంలో ఉచిత వైద్య శిబిరాలను కూడా నిర్వహిస్తున్నట్టు ఆయన చెప్పారు. విలేకరుల సమావేశంలో సర్వర్ పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు


లక్ష తులసి అర్చన చేస్తున్న అర్చకులు

సుల్తానాబాద్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ధనుర్మాసం సందర్భంగా సుల్తానాబాద్ వేణుగోపాల స్వామి ఆలయంలో శనివారం లక్ష తులసి దళాలతో ప్రత్యేక అర్చన పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున తులసి దళాలు తీసుకువచ్చారు. గోదా అష్టోత్తర, కృష్ణాష్టోత్తర స్తోత్రాలు, కృష్ణాష్టకం వంటివి సామూహికంగా పారాయణం చేశారు. పలువురు మహిళలు భక్తి గీతాలు సంకీర్తనలు ఆలపించగా మరి కొందరు భజనలు చేశారు. సాయంత్రం సామూహిక విష్ణుసహస్ర నామాల స్తోత్రాల పారాయణం చేశారు. ఈ కార్యక్రమాల్లో అర్చకులు సౌమిత్ర శ్రావణ్ కుమార్ హరిణి, గోపీ, వినయ్, వికాస తరంగిణీ ప్రతినిదులు సునిత, జలజ, సుభాషిణి, కట్ట రమ, వనజ, కొమురవెల్లి లత, అరుణ రవి తదితరలు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇల్లు రాలేదని ఆందోళన వద్దు..

- విడతల వారీగా అర్హులందరికీ ఇళ్ల కేటాయింపు - పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు


ఇందిరమ్మ ఇళ్ల పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లిటౌన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇల్లు రాలేదని పేదలు ఆందోళన చెందవద్దని, ప్రతి నిరుపేదకు విడతల వారీగా మంజూరుచేస్తామని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు స్పష్టం చేశారు. పెద్దపల్లి మండలంలోని చందపల్లి, హనుమంతునిపేట (రాంపల్లి) శివారుల్లో నిర్మించిన డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లలో మౌలిక వసతుల కల్పన పనులను శనివారం మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో అసంపూర్తిగా డబుల్ బెడ్‌రూమ్‌ల నిర్మాణాలు వదిలేశారన్నారు. ఇప్పటికే 4కోట్ల రూపాయలు కేటాయించి డ్రైనేజీలు, రోడ్లు, నీటిసంపులు, ఇతరత్రా మౌలిక వసతుల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామన్నారు. త్వరలో అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అలాగే స్థలం ఉంటే ఇంటి నిర్మాణం కోసం 5లక్షల రూపాయలు ఇవ్వనున్నట్లు తెలిపారు. సర్వే ఇప్పటికే పూర్తి కావోస్తోందని, నిరుపేదలకు మొదటి దశలో ఇళ్ల కేటాయింపు జరుగుతుందని వివరించారు. ఏడాదికి నియోజకవర్గానికి 3వేల 500 చొప్పున ఇళ్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. దశలవారీగా అర్హులైన అందరికీ ఇళ్లు కేటాయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, ఎ.ఈ, విద్యుత్ అధికారులు, ఏఎంసీ చైర్‌పర్సన్ ఈర్ల స్వరూప, పట్టణ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, డబుల్ బెడ్ ఇళ్ల లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

హామీలను విస్మరిస్తే ఉద్యమం : సీఐటీయూ

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కార్మికులకు ఇచ్చిన హామీలను గెలిచిన సంఘాలు, అధికార పార్టీ విస్మరిస్తే కార్మికులతో ఉద్యమం తప్పదని సీఐటీయూ అనుబంధ సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి పేర్కొన్నారు. శనివారం వకీల్‌పల్లె గనిలో జరిగిన గేట్‌మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. పెర్క్స్ మీద ఐటీ రీయింబర్స్, సొంత ఇంటి పథకం అమలుచేస్తామని అసెంబ్లీ ఎన్నికల సందర్భంలో, సింగరేణి ఎన్నికల సమయంలో పార్టీలు, యూనియన్లు కార్మికులకు ఇచ్చిన హామీని అమలుచేయడంలో శ్రద్ధ చూపడంలేదన్నారు. గెలిచిన సంఘాలు, అధికార పార్టీ కార్మికులను పట్టించుకోలేదని, కార్మికులు భవిష్యత్తు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఏరియా సెక్రెటరీ కుంట ప్రవీణ్, నాయకులు ఎస్ వెంకన్న, నరహరిరావు, నరసింహ, శ్రావణ్, జగదీష్, వినయ్‌రాజ్, వినేష్, శివ, కిషోర్, సంతోష్ పాల్గొన్నారు.

గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలు విఫలం


మాట్లాడుతున్న అయిలి శ్రీనివాస్

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కులను సాధించడంలో గెలిచిన సంఘాలు విఫలమయ్యాయని టీబీజీకేఎస్ ఆర్జీ-2 వైస్‌ప్రెసిడెంట్ అయిలి శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం యూనియన్ కార్యాలయంలో ఏరియా ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. సమస్యల పరిష్కారంలో జాతీయ సంఘాలు ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నాయన్నారు. సమావేశంలో మాదాసు రామ్మూర్తి, నూనె కొంరయ్య, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాయమల్లు సంఘం ఫౌండర్ కాదు..

కళ్యాణ్‌నగర్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం ఫౌండర్ న్యాతరి రాయమల్లు కాదని సంఘం నాయకులు ముక్క సుదర్శన్ చెప్పారు. శనివారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 21న సింగరేణి జీఎం కార్యాలయం ఎదుట ఆవిష్కరించిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహ శిలాఫలకంపై న్యాతరి రాయమల్లు అధ్యక్షుడు అని పెట్టడం సబబు కాదన్నారు. దీనిపై జిల్లా అధ్యక్షున్ని అడిగితే తప్పు జరిగిందని చెప్పారని, ఈ శిలఫలకంపై పేరు మార్చాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పిట్టల రాములు ఉన్నారు.

పార్కు ఏర్పాటు చేయాలి

కమాన్‌పూర్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండారం రిజర్వాయర్ కట్టపై పార్కును ఏర్పాటుచేయాలని కోరుతూ హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో మాజీ సర్పంచ్ ఆకుల ఓదెలు, మాజీ ఉపసర్పంచ్ రాచకొండ చంద్రమౌళి, గ్రామస్థులు వినతిపత్రం సమర్పించారు.పార్కు ఏర్పాటుచేస్తే ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని కోరగా సీఎండీ సానుకూలంగా స్పందించారు.

నెలాఖరుకు 'ఇందిరమ్మ' సర్వే పూర్తి

- జడ్పీ సీఈవో నరేందర్


సుల్తానాబాద్‌లో పనులను పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో నరేందర్

సుల్తానాబాద్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ళ సర్వేను వేగవంతం చేయాలని, ఈనెలాఖరు వరకు పూర్తి చేయాలని పెద్దపల్లి జడ్పీ సీఈవో కె. నరేందర్ అన్నారు. మండలంలోని నీరుకుళ్ళ గ్రామంలో శనివారం సీఈవో నరేందర్ ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో పాల్గొని పర్యవేక్షించారు. సర్వేలో అధికారులు ఆయా ఇంటి యజమానుల నుంచి సేకరించిన వివరాలను నమోదు చేస్తున్న తీరును పరిశీలించారు. మండలంలో మొత్తం 11,268ఇళ్లకు 5400 ఇళ్ల సర్వే పూర్తయిందని ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు తెలిపారు. అందుబాటులో లేని వారి వివరాలను తెలుసుకుని వారితో ఫోన్‌లో మాట్లాడి వారికి సంబందించిన వివరాలను నమోదు చేసుకోవాలని సీఈవో సూచించారు.

ప్రభుత్వ పాఠశాల పనుల పరిశీలన

సుల్తానాబాద్ పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో జరుగుతున్న పనులను జడ్పీ సీఈవో నరేందర్ పరిశీలించారు. రూ.17 లక్షలతో చేపట్టిన మరమ్మతు పనులు పరిశీలించారు. త్వరగా పనులు పూర్తిచేయాలని అధికారులకు సూచించారు.

● కమాన్‌పూర్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రతిరోజు 50కు తగ్గకుండా ఇందిరమ్మ గృహాలను సర్వే పూర్తి చేయాలని మంథని డివిజనల్ పంచాయతీ అధికారి కొమ్మెర సతీష్ ఆదేశించారు. శనివారం మండలంలోని పెంచికల్‌పేట గ్రామంలో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సర్వే జరుగుతున్న క్రమంలో వంద శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని ఆదేశించాచ. ఈనెల 30వ తేదీ నాటికి పూర్తి చేయాలని ప్రతిరోజు సర్వేను ఉదయం 7 గంటలకు ప్రారంభించాలని కోరారు. సిబ్బంది సర్వే పూర్తయ్యే వరకు ఎటువంటి సెలవులు పెట్టకూడదన్నారు. అనంతరం పారిశుధ్య పనులను పరిశీలించారు. అనంతరం పాఠశాలను తనిఖీ చేసి మధ్యాహ్న భోజనం నాణ్యతంగా ఉండాలని ఆదేశించారు. ఆయనవెంట గ్రామకార్యదర్శి ముల్కూరి తిరుపతి ఉన్నారు.

అభివృద్ధికి ప్రాధాన్యం..

(5వ పేజీ తరువాయి)

వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి 7 కోట్ల రూపాయలు, పెంచికల్‌పేట్ నుంచి ఎఫ్‌సీఐ వరకు రోడ్డు నిర్మాణానికి రూ.4 కోట్లు, రాజాపూర్ బండలవాగుపై వంతెన నిర్మాణం, మంగపేట రోడ్ కోసం రూ.3 కోట్లు మంజూరు చేశారు. పెద్దపల్లి పట్టణంలో ట్రాఫిక్ సమస్యలను నివారించేందుకు ఎప్పటినుంచో ప్రతిపాదనలో ఉన్న బైపాస్ రోడ్డు నిర్మాణానికి రూ.82 కోట్లు. ఆర్‌అండ్‌బీ ద్వారా కాల్వశ్రీరాంపూర్, ఓదెల, ఎలిగేడు, సుల్తానాబాద్ మండలాలను అనుసంధానం చేసేందుకు, జూలపల్లిలో హుస్సేనిమియావాగుపై వంతెన నిర్మాణానికి 80 కోట్ల రూపాయలు మంజూరయ్యాయి. పెద్దపల్లి మున్సిపాలిటీలో టీయూ ఎఫ్ఐడీ ద్వారా రూ.77.90 కోట్లు, సుల్తానాబాద్ మున్సిపాలిటీలో రూ.31.55 కోట్ల నిధులు మంజూరుచేయగా, పనులు నడుస్తున్నాయి. జేఎన్‌టీయూసీ నుంచి గోదావరిఖని యైటింక్లయిన్ వరకు 14 కోట్లతో నాలుగు లైన్ల రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. రూ.10 కోట్ల సీఎం స్పెషల్ గ్రాంట్, రూ.40 కోట్ల డీఎంఎఫ్‌టీ నిధులతో వివిధ పనులు చేపట్టారు. రూ.63 కోట్లతో ఆర్‌అండ్‌బీ రోడ్ల నిర్మాణం చేపట్టనున్నారు. రామగుండం ఫ్లైఓవర్ రైట్‌ఆర్మ్, గ్రామాల్లో డబుల్ రోడ్లు, సర్వీస్ రోడ్లకు నిధులు కేటాయించారు. రూ.26 కోట్లతో సింగరేణి కాలనీల్లో అంతర్గత రహదారులు, మున్సిపల్‌లో రోడ్లు, డ్రైన్ల అభివృద్ధికి రూ.20 కోట్ల ప్రత్యేక నిధులు, ఫ్లడ్ గ్రాంట్ కింద రూ.2 కోట్లు మంజూరు చేయించారు.

● విద్య, వైద్యం, విద్యుత్, టూరిజానికి..

రామగిరిఖిల్లా, మంథని సర్క్యూట్‌గా పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు 6కోట్ల రూపాయలతో పనులను ప్రారంభిస్తున్నారు. మంథని, పోతారంలో రెండు సబ్‌స్టేషన్ల నిర్మాణాలకు రూ.10కోట్లు, అడవిసోమన్‌పల్లిలో న్యూ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ భవన సముదాయ నిర్మాణానికి రూ.250 కోట్లు మంజూరు కాగా, మంత్రి శ్రీధర్‌బాబు భూమి పూజ చేశారు. మంథనిలోగల 50 పడకల ఆసుపత్రి భవన నిర్మాణానికి రూ.5కోట్లు, గుంజపడుగులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రూ.2.43 కోట్లు, అర్ధంతరంగా నిలిచిపోయిన చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు పనులు పూర్తిచేయించేందుకు రూ.513 కోట్లు మంత్రి శ్రీధర్ బాబు మంజూరుచేయించారు. పెద్దపల్లి ప్రజల రెండు దశాబ్దాల చిరకాల వాంఛ అయిన పెద్దపల్లికి ఆర్టీసీ బస్సు డిపో మంజూరుచేయగా, సీఎం శంకుస్థాపన చేశారు. బస్టాండ్‌ను ఆనుకుని ఉన్న 4.31 ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం ఉచితంగా కేటాయించింది. గ్రంథాలయ భవనానికి రూ.5 కోట్లు, మహిళా ప్రాంగణం భవనానికి రూ.5కోట్లు, జడ్పీ భవనానికి రూ.8.15 కోట్లు, కాల్వశ్రీరాంపూర్, ఓదెల మండలాల్లో తహసీల్దార్ కార్యాలయాల భవనాలకు కోటి రూపాయలు, కాల్వశ్రీరాంపూర్ కేజీబీవీ పాఠశాలలో అదనపు తరగతి గదులు, ల్యాబ్ కోసం రూ.3.25 కోట్లు మంజూరుచేశారు. పెద్దపల్లిలో బాలికల జూనియర్ కళాశాల భవనానికి రూ.20 కోట్లు, ఎన్నో ఏళ్లుగా పెండింగులోగల పెద్దపల్లి రూరల్, మహిళా, ట్రాఫిక్, ఎలిగేడు పోలీస్‌స్టేషన్లు మంజూరయ్యాయి. పెద్దపల్లి ట్రాన్స్‌కో ఎస్ఈ కార్యాలయం, కాచాపూర్, రంగాపూర్‌లో సబ్ స్టేషన్ల నిర్మాణాలకు రూ.25.89 కోట్లతో చేపట్టనున్న పనులకు ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క శ్రీకారం చుట్టారు. న్యూఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ భవన సముదాయ నిర్మాణానికి రూ.250 కోట్లు, పెద్దపల్లి ఆసుపత్రిని 100 పడకలకు అప్‌గ్రేడ్ చేస్తూ రూ.51కోట్లు మంజూరుచేశారు. టీయూఎఫ్ఐడీసీ నిధులతో రామగుండం నగర పాలక సంస్థలో అభివృద్ధి పనులు, రూ.180 కోట్లు అమృత్ నిధులు మంజూరు, ఎస్‌టీపీల నిర్మాణానికి టెండర్లు ఆహ్వానించారు. రూ.15 కోట్లతో సింగరేణి ఆధ్వర్యంలో షాపింగ్ కాంప్లెక్స్, గోదావరిఖని జనరల్ ఆసుపత్రిలో 350 పకడల ఆసుపత్రి నిర్మాణానికి రూ.140 కోట్లు మంజూరు చేయించారు. ఎమర్జెన్సీ వారుకు రూ.16 కోట్లు, నర్సింగ్ కళాశాల నిర్మాణానికి రూ.16 కోట్లు, పారా మెడికల్ కళాశాల మంజూరు చేయించారు. రూ.10 కోట్లతో సింగరేణి ఆసుపత్రిలో క్యాత్ ల్యాబ్, రూ.100 కోట్లతో ఇంటిగ్రేటెడ్ పాఠశాల, రామగుండంలో ఈఎస్ఐ ఆసుపత్రి మంజూరుచేయించారు. రామగుండం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటు చేయించగా, జెన్‌కో, సింగరేణి సంయుక్త ఆధ్వర్యంలో 800 మెగావాట్ల విద్యుత్ కేంద్రం ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. గోదావరిఖనిలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, రామగుండంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ప్రారంభం, బండలవాగు ప్రాజెక్టు ఎలక్ట్రికల్ పనులకు రూ.10 కోట్లు మంజూరు చేయించారు. వీటిలో కొన్ని పనులు ప్రారంభంకాగా, మరికొన్ని ప్రారంభం కావల్సి ఉన్నాయి. ఇంకా జిల్లాలో అనేక సమస్యలు పరిష్కారం కావాల్సి ఉన్నాయి.

రాజ్యాంగ ప్రతులను అందించండి

గోదావరిఖని, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగం ఆమోదం పొంది అమలు 75 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా కార్మికులు, ఉద్యోగులకు రాజ్యాంగ తెలుగు పుస్తకాలను అందజేయాలని సింగరేణి సీఎండీ బలరామ్‌నాయక్‌ను కోరారు. ఈ మేరకు శనివారం కొత్తగూడెంలో సీఎండీని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మైస రాజేష్, సింగరేణి ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం కేంద్ర కమిటీ ప్రధానకార్యదర్శి అంతోటి నాగేశ్వరరావు కలిసి భారత రాజ్యాంగం పుస్తకాన్ని బహుకరించారు. సింగరేణి వ్యాప్తంగా భారత రాజ్యాంగం పుస్తకాన్ని అధికారులకు కార్మికులకు ఉద్యోగులకు అందజేయాలని కోరారు.

దొంగ అరెస్ట్

పెద్దపల్లిటౌన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పెన్షన్ ఇప్పిస్తానంటూ వృద్ధులను దోచుకుంటున్న దొంగను శనివారం పెద్దపల్లి ఎస్సై మల్లేష్ పట్టుకున్నారు. కేసు వివరాలను తన కార్యాలయంలో ఎస్సై మల్లేష్ వెల్లడించారు. పాత నేరస్థుడైన సిద్ధిపేటకు చెందిన అల్లెపు కృష్ణ ఇటీవలే జైలు నుంచి బయటకు వచ్చాడు. బొంపెల్లి గ్రామానికి చెందిన గుర్రాల సత్తెమ్మ ఈనెల 25న ఆర్డీవో ఆఫీస్ ఎదురుగా అల్లెపు కృష్ణకు ఒంటిరిగా కనిపించింది. మాయమాటలతో పింఛన్ ఇప్పిస్తానని నమ్మించి, బంగారు ఆభరణాలతో ఉడాయించాడు. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించి పెద్దపల్లి బస్టాండ్‌లో చాకచక్యంగా పట్టుకున్నారు. అల్లెపు కృష్ణపై నాలుగు కేసులు నమోదు చేశారు. ఇతర ప్రాంతాల్లో దోచుకున్న సొత్తుతో పాటు సుమారు 50గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. నిందితున్ని కోర్టులో హాజరుపర్చనున్నట్లు తెలిపారు. నేరస్థుడిని పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన ఎస్ఐ లక్ష్మణ్‌రావు, ఎస్ఐ మల్లేష్, సిబ్బందిని పెద్దపల్లి ఏసీపీ జీ.కృష్ణ అభినందించారు.

రేపు పెంచికల్‌పేట్‌లో సింగరేణి వైద్య శిబిరం

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పెంచికల్‌పేట్‌లో సోమవారం సింగరేణి ఆర్జీ-2యాజమాన్యం ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్లు జీఎం బండి వెంకటయ్య తెలిపారు. వకీల్‌పల్లె గని ప్రజాభిప్రాయ సేకరణలో వచ్చిన అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని రేమేడియేషన్ మేషర్స్ కింద వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు జీఎం పేర్కొన్నారు. వకీల్‌పల్లె గని ప్రభావిత గ్రామమైన పెంచికల్ పేట్ గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో 30న ఉదయం సింగరేణి వైద్యులు వైద్య పరీక్షలు చేయనున్నట్లు తెలిపారు. వైద్య శిబిరంలో స్పెషలిస్టు వైద్యులు అందుబాటులో ఉంటారని, పెంచికల్‌పేట్‌వాసులు ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని జీఎం బండి వెంకటయ్య సూచించారు.